ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5 జనగామ
మంగళవారం 23 జనవరి 2024

జీపీ నిధుల అవకతవకలపై విచారణ

లింగాలఘణపురం, జనవరి22: మండలంలోని నేలపోగుల గ్రామపంచాయతీ నిధులను స్థానిక సర్పంచ్ దూసరి గణపతి అక్రమంగా కాజేశారని గతంలో స్థానిక ఎంపీటీసీ గుగ్గిల్ల నర్సయ్య చేసిన అభియోగంపై సోమవారం డీపీవో రంగాచారి విచారణ చేపట్టారు. రికార్డులను పూర్తి స్థాయిలో పరిశీలించి కలెక్టర్‌కు నివేదిస్తానని అన్నారు. పంచాయతీరాజ్ సమాచార హక్కు చట్టాన్ని అనుసరించి పూర్తి వివరాలను ఎంపీటీసీకి అందజేయాలని కార్యదర్శి నాగరాజును ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ దూసరి గణపతి, ఎంపీటీసీ గుగ్గిల్ల నర్సయ్య, ఉపసర్పంచ్ ఆవుల ఎల్లమ్మ, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అందించే బాధ్యత నాది

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

తరిగొప్పుల, జనవరి 22: ప్రతీ పేద కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందించే బాధ్యత తాను తీసుకుంటానని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండలంలోని బొంతగట్టునాగారం, బొత్త లపర్రె గ్రామాలలో పర్యటించారు. ఏడు పోచమ్మల గడ్డపై వెలసిన సమ్మక్క సారలమ్మలను దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించారు. అనంతరం దేవ స్థానం సమీపంలో గిరిజన కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ తనను భారీ మెజారిటీతో గెలిపించిన కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటానని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలపై కేసులు బనాయించి అణచివే యాలని చూస్తోందని, కార్యకర్తలు ఎవ్వరూ అధైర్యపడొద్దని ధీమా కల్పించారు. వచ్చే రెండు వారాల్లో వరంగల్‌లో భారీ బహిరంగసభ ఏర్పాటు చేయబోతున్నామని, ఈ సభను కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు పింగిళి జగన్‌మోహన్ రెడ్డి, ఎంపీపీ జొన్నగోని హరిత సుదర్శన్ గౌడ్, అధికార ప్రతినిధి చిలువేరు లింగం, ఎంపీటీసీ భూక్య జుంలాల్ నాయక్, సర్పంచ్‌లు భూక్య కమల, ఇరు మల్ల బాలమణి తదితరులు పాల్గొన్నారు.

కాలువ ద్వారా సాగునీరందిస్తాం

నీటి పారుదల శాఖ డీఈ సంపత్


తీగారంలో రైతులతో కలిసి కాలువను పరిశీలిస్తున్న ఇరిగేషన్ డీఈ సంపత్, అధికారులు

జఫర్‌గఢ్, జనవరి 22 : స్టేషన్‌ఘన్‌పూర్ రిజర్వాయర్ ద్వారా మండలంలోని తీగారం రైతులకు సాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటామని నీటి పారుదల శాఖ డీఈ సంపత్ అన్నారు. తీగారం కాలువ పూడుకుపోయిన విషయాన్ని ఇటీవల గ్రామస్థులు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిరకు వివ రించారు. స్టేషన్‌ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి విశ్వనాథగూడెం, తాండార్‌పల్లి మీదుగా జఫర్‌గడ్ మండలంలోని తీగారం చెరువులోకి నీరు నింపే ప్రధాన ఎల్ -1 ఉప కాలువ పూడుకుపోయిందని, దీంతో పంట పొలాలకు నీరు అంద కుండా పోతోందని ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆయన ఏఈ యాసర్, ప్రాజెక్టు మేనేజర్ ధనుంజయ్, స్థానిక ఉపసర్పంచ్ కల కోట అనిల్‌కుమార్‌తో కలిసి తీగారంలో కాలువ పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలువను యంత్రాలతో శుభ్రపరిచి.. రిజర్వాయర్ నీటిని సక్రమంగా సరఫరా చేసి పంటలకు నీరు అందించేలా చర్యలు తీసుకుం టామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కలకోట మైసయ్య సింపురం అశోక్, రైతులు పాల్గొన్నారు.


జై శ్రీరామ్

రామనామంతో మార్మోగిన ఆలయాలు

- ఘనంగా బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠా ఉత్సవాలు
- ఆలయాల్లో డిజిటల్ స్క్రీన్‌ల ఏర్పాటు
- ప్రత్యక్షప్రసారం ద్వారా వీక్షించిన భక్తులు
- ఇళ్లల్లో సైతం టీవీలకు అతుక్కుపోయిన జనం
- ఊరూరా శోభాయాత్రలు, అన్నదానాలు
- జిల్లావ్యాప్తంగా ఆధ్యాత్మిక సందడి


నర్మెటలో శ్రీరాముని శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు





జనగామ కల్చరల్, జనవరి 22: జై శ్రీ రామ్.. అం టూ ఆలయాలు మార్మోగాయి. జిల్లా వ్యాప్తంగా రామ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ఘనంగా జరిగాయి. అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లా లోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద స్క్రీన్‌లు ఏర్పాటు చేసి ప్రజలంతా అయోధ్యలోని రామ మందిరంలో విగ్రహ ప్రతిష్ఠాపన ప్రత్యక్ష ప్రసారం చూసేలా ఏర్పాట్లు చేశారు.

అయోధ్య శ్రీరామ మందిరంలో బాలరాముడి విగ్ర హ ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రం లోని శ్రీరాంనగర్ కాలనీ శ్రీ హనుమత్ రామ నాథ సహిత శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం లో అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేశారు. ప్రధానార్చకులు మోహనకృష్ణ భార్గవ నేతృత్వంలో శ్రీరామ విజయ తారక మంత్ర సామూహిక ప్రార్థనలతో ప్రారంభమైన వేడుకలు జనగామ భక్త బృందం వారిచే వివిధ రామ స్తోత్ర పారాయణాలు, కీర్తనలు జరుపగా ఏకల్ అభి యాన్ వారిచే ప్రత్యేక భజనలు నిర్వహించారు. అనం తరం సామూహికంగా హనుమాన్ చాలీసా పారాయ ణం చేశారు. ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించిన భక్తులు భక్తి పారవశ్యంతో రామనామ సంకీర్తనలతో అపూర్వ మైన అనుభూతికి లోనయ్యారు. దేవాలయ ప్రాంగణ మంతా రామ నామంతో మార్మోగగా భక్తులు తన్మయ త్వంతో బాల రాముడిని దర్శించుకున్నారు. అయోధ్య రాముడికి నీరాజనం అందిన వెంటనే అర్చకులు స్థానిక దేవాలయ మూలమూర్తులైన శ్రీ సీతారామచంద్ర స్వా మి వారలకు విశేష మహానీరాజనం అందించారు.

మహా మంత్రపుష్పం అయోధ్య నుంచి అం దిన పరమ పవిత్ర పూజిత అక్షింతలతో భక్త లకు మహదాశీర్వచనం అందించారు.

పోరాట ఫలితమే...

ఈ సందర్భంగా శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు జిల్లా ప్రముఖ్ దొంతుల శేఖర్ మాట్లాడుతూ దశాబ్దాల పోరాటం, లక్షలాది మంది ప్రాణత్యాగాల ఫలితంగా నేడు నూట నలభై కోట్ల మంది హిందువుల కల సాకా రమైందన్నారు. మోహనకృష్ణ మాట్లాడుతూ అయోధ్య మోక్ష క్షేత్రాలలో ప్రధానమైందని, సాక్షాత్తూ శ్రీరామచ ద్ర ప్రభువు పుట్టిన జన్మభూమిలో ఇన్ని సంవత్సరాల తర్వాత బాలరాముడిని పునఃప్రతిష్ఠాపన జరుపుకోవ డం ఆనందంగా ఉందన్నారు. ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించిన భక్తుల జన్మ ధన్యమైందన్నారు. అనంతరం భక్తులు అన్న ప్రసాదం అందించారు. కార్యక్రమంలో గజ్జెల నర్సిరెడ్డి, పజ్జూరి లక్ష్మీనర్సయ్య, జీవిలికపల్లి సత్య నారాయణ, వేముల సదానందం, యెలసాని కృష్ణమూ ర్తి, మల్లారెడ్డి, యాదగిరి, రాంబాబు, కుర్రెముల రాం ప్రసాద్, కళ్లెం నాగరాజు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా జిల్లా కేంద్రంలోని బార్ అసోసియేషన్ హాల్లో బాలరాముడి చిత్రపటానికి పూజలు నిర్వహించారు. అనంతరం న్యాయవాదుల సహకారంతో అన్న ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కూరెళ్ల శ్రీనివాస్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ రాజయ్య, ప్రసాదరావు, జాన్‌రెడ్డి, రాంగోపాల్, సుధీరంజన్ తదితరులు పాల్గొ న్నారు. అదే విధంగా స్థానిక పోచమ్మ గుడి వద్ద మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బండ పద్మ యాదగిరిరెడ్డి, కొల్లూరు లక్ష్మయ్య, ఆంజనేయులు, నిడిగొండ కృష్ణ పాల్గొన్నారు.

వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్...

అయోధ్యలో రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ఠాపన నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని గుండ్లగడ్డ ఉమామ హేశ్వర గుడిలో జరిగిన సీతారాముల ప్రత్యేక పూజా కార్యక్రమంలో కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య పాల్గొ న్నారు. పురోహితులు కలెక్టర్‌కు పూర్ణకుంభంతో స్వాగ తం పలికి మహదాశీర్వచనం అందించారు. వినాయ కుడి పూజతో ప్రారంభించి హనుమాన్ చాలీసా, భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు రాజేష్, చుంచు శ్రీకాంత్, ప్రభాకర్, రఘు, శ్రీనివాస్, నర్సింగరావు, ప్రకాష్, రామిని అనూరాధ, రేణుక తదితరులు పాల్గొన్నారు.


నెల్లుట్లలో శ్రీరామ కల్యాణంలో పాల్గొన్నఎంపీపీ దంపతులు


పోచన్నపేటలో పూజా కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్థులు


జనగామ శ్రీరాంనగర్ కాలనీలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న మహిళలు

ప్రజావాణి దరఖాస్తులపై స్పందించాలి

అధికారులకు కలెక్టర్ ఆదేశాలు


అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ శివలింగయ్య

జనగామ టౌన్, జనవరి 22: ప్రజావాణి దరఖాస్తులు సత్వర పరిష్కారం అయ్యేలా అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య సూచిం చారు. సోమవారం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. 44 మంది నుంచి వివిధ రకాల సమస్యలపై అర్జీలు తీసుకున్నారు. ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించిన దరఖాస్తులే ఎక్కువగా వచ్చాయి. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటిక ప్పుడు పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కొడ కండ్ల మండలం రామవరం గ్రామానికి చెందిన అజయ్‌కుమార్ తన కుటుంబా నికి సంబంధించి లేబర్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన డెత్ ఇన్సూరెన్స్ కోసం దర ఖాస్తు అందజేశారు. తనకు డబుల్ బెడ్రూం ఇవ్వాలని కోరుతూ స్టేషన్‌ఘన్‌పూ ర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కె.రేణుక అర్జీ పెట్టుకున్నారు. ధరణి పోర్టల్‌లో భూ సమస్యను పరిష్కరించాలని దేవరుప్పుల మండలం కడవెండి గ్రామానికి చెందిన ఆర్.సోమయ్య కోరారు. సదరం సర్టిఫికెట్, పింఛన్ ఇప్పించా లంటూ లింగాలఘణపురం మండలకేంద్రానికి చెందిన మల్లారెడ్డి వినతిపత్రం ఇచ్చారు. ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు పింకేశ్‌కుమార్, సుహా సిని, జడ్పీ సీఈవో అనిల్‌కుమార్, డీఆర్‌డీవో మొగులప్ప, సీపీవో ఎస్.కే.ఇస్మా యిల్, డీఈవో రాము, డీసీఎస్‌వో రోజారాణి, డీడబ్ల్యూవో జయంతి, డీఏవో వినో ద్‌కుమార్, కలెక్టరేట్ ఏవో రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను చేర్యాలకు తరలించొద్దు..

నర్మెట తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాల(బాలికల)ను మరో ప్రాంతానికి తరలించేందుకు కుట్ర చేస్తున్నారని, ఈ ఆలోచనను విర మించుకోవాలని కోరుతూ విద్యార్థులు తల్లిదండ్రులు గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం నర్మెట పాఠ శాల జనగామలో అద్దె భవనంలో అరకొర వసతుల మధ్య నడుస్తోందన్నారు. ప్రస్తుతం ఈ పాఠశాల/కళాశాలను చేర్యాలకు తరలించేందుకు ప్రయత్నిస్తు న్నారని ఆరోపించారు. తల్లిదండ్రులకు కనీసం సమాచారం ఇవ్వకుండా చేర్యా లలోని ఎలాంటి మౌలిక వసతులు లేని భవనానికి తరలించడం సరికాదని, వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు.

అత్తామామలు వేధిస్తున్నారు..

- నోముల రేణుక, జనగామ



నేను నా భర్త వీరస్వామి కూలినాలి చేసు కుని బతుకుతున్నాం. మా ఇద్దరు పిల్లలను ప్రభుత్వ హాస్టల్‌లో చదివిస్తున్నాం. మా అత్తామామలు అక్రమ కేసులతో మా కుటుం బాన్ని వేధిస్తున్నారు. ఆస్తులన్నీ మా మామ పేరు మీద పెట్టుకున్నారు. మేము వారి ఇంట్లో ఉండొద్దనే ఉద్దేశంతో అక్ర మంగా వయోవృద్ధుల పోషణ చట్టం కింద కేసు పెట్టారు. మేము అత్తామా మలను చూసుకోవడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ మా పిల్లలపై కూడా కేసు పెట్టి నోటీసులు ఇస్తున్నారు. పోలీసుల చుట్టూ తిరిగి కూలి పనులు కూడా పోగొట్టుకున్నాం. సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలి.

నా భూమిని వేరేవాళ్లు అమ్ముకున్నారు..

- కర్ల లక్ష్మారెడ్డి, మచ్చుపహాడ్, నర్మెట మండలం



నాకు మా తండ్రి నుంచి వారసత్వంగా రెండు న్నర ఎకరాల భూమి వచ్చింది. ఆ భూమిని నా పేరు మీద 2012లో పట్టా కూడా చేయించుకు న్నా. కొన్ని సంవత్సరాల క్రితం నాకు తెలియకుం డా మా చిన్నాన్న ఎకరం 11 గుంటల భూమిని మరొకరికి అమ్మారు. నా భూమిలోకి నన్నే రాని వ్వడం లేదు. సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదు. నా భూమి నాకు అప్పగించాలని కోరుతున్నా.

అసోం సీఎం క్షమాపణ చెప్పాలి

కాంగ్రెస్ నాయకుల నిరసన ర్యాలీ


జనగామలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వివరాలు 8వ పేజీలో..

బడులకూ ఇవ్వాలి ఉచితం!

సర్కారు స్కూళ్లకు ఉచిత విద్యుత్ ఇస్తే మేలు

రూ. వేలల్లో పేరుకుపోతున్న బిల్లులు

స్కూల్ గ్రాంట్‌లో సింహభాగం కరెంట్ బకాయిలకే

ప్రభుత్వం దృష్టి సారించాలంటున్న ఎస్ఎంసీలు


దేవరుప్పుల హైస్కూల్‌లో డిజిటల్ స్క్రీన్‌పై బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

దేవరుప్పుల, జనవరి 22: గృహ అవసరాలకు ఇచ్చినట్లుగానే ప్రభుత్వ పాఠశాలలకు కూడా 200 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉచితంగా ఇవ్వాలని ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ కమిటీలు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోధనకు అంకురా ర్పణ జరిగింది. జిల్లా లోని అనేక పాఠశాలల్లో డిజి టల్ బోర్డులు, ఎల్ఈడీ తెరలు ఏర్పాటు చేశారు. దీంతో పాటు బల్బులు, ఫ్యాన్లు, కంప్యూటర్లు పనిచే స్తున్నాయి. విద్యార్థుల మార్కులను నమోదు చేయ టానికి ట్యాబ్‌లను సైతం అందించారు. వీటి చార్జింగ్, ఇతరత్రా అవసరాలకు విద్యుత్ తప్పని సరి. ఈ నేపథ్యంలో ఆయా పాఠశాలలకు ఉచిత విద్యుత్‌ను అందించాలని డిమాండ్ వస్తోంది.

విద్యుత్ బిల్లుల చెల్లింపులకే..

ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలకు వేలల్లో విద్యుత్ బిల్లులు వస్తున్నాయి. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఆకౌంట్లలో స్కూల్ గ్రాంట్లు ప్రభుత్వం వేసిన తర్వా తనే విద్యుత్ బిల్లులను చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వం పాఠశాలలకు ఇచ్చే నిధులు కేవలం విద్యుత్ బిల్లులు చెల్లించేందుకే సరిపోతున్నాయని ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు వాపోతు న్నారు. పైగా బడులకు అందించే విద్యుత్‌కు ఏడో కేటగిరిలో చార్జీలను వసూలు చేస్తున్నారు. ఇందులో యూనిట్ విద్యుత్‌కు రూ.8.30 చొప్పున బిల్లు పడుతోంది. ఇది మరీ దారుణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మోయలేని భారం..

పాఠశాలల్లో ఒక్క యూనిట్ విద్యుత్ చార్జీ రూ. 8పైగా పడుతుండడంతో ఆరు తరగతి గదులు ఉన్న ప్రాథమిక పాఠశాలకు నెలకు సుమారు రూ.800వరకు బిల్లు వస్తోంది. అదే విధంగా 7నుంచి 10తరగతి గదులు ఉన్న ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు నెలకు సగటున రూ.1100పైన విద్యుత్ భారం పడుతోంది. దీనికి అదనంగా సర్‌చా ర్జీలు, ఆలస్య జరిమానాల రూపంలో మరో రూ.200వరకు కలుస్తున్నది. దీంతో ఆయా పాఠశాల లకు యేటా రూ.10వేల నుంచి 12వేల వరకు విద్యు త్ బిల్లులకే వ్యయం అవుతోందని ప్రధానోపాధ్యా యులు చెబుతున్నారు.

ఉచితం విద్యుత్ అందిస్తే మేలు..

- వాంకుడోతు బీకోజీ, పీఆర్‌టీయూ నాయకుడు



ప్రభుత్వ పాఠశాలకు ఉచిత విద్యుత్ అందించాలి. ఈ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులుగా మేము ఇప్పటికే ప్రభు త్వానికి విజ్ఞప్తి చేశాం. స్కూళ్లకు వచ్చే గ్రాంట్లలో సింహభాగం విద్యుత్ బిల్లులకే ఖర్చవుతున్నాయి. కొన్ని పాఠశాలల్లో విద్యుత్ బిల్లులు చెల్లించలేక బకాయిలు పేరుకుపోతున్నా యి. ఈ విషయంలో ప్రభుత్వం ఆలోచన చేయాలి.

డిజిటల్ బోధనకు తోడ్పాటు..

- నాతి శ్రీను, ఎస్ఎంసీ చైర్మన్, దేవరుప్పుల హైస్కూల్



ప్రభుత్వ బడుల్లో ఉచిత విద్యుత్ అందిస్తే డిజిటల్ ప్యానె ల్ బోర్డులు, ఎల్ఈడీ తెరలు మరింత ఎక్కువగా వినియోగించుకోవటానికి అవ కాశం ఉంటుంది. బోధన కూడా విద్యార్థు లకు సులువుగా అర్థమవుతుంది. అందువల్ల ప్రభుత్వం పాఠశాలలకు ఉచిత విద్యుత్ అందించాలి.

30 నుంచి ఇంజనీరింగ్ మొదటి సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, జనవరి 22 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో జనవరి 30 నుంచి ఇంజనీరింగ్ మొదటి ఏడాది మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికారెడ్డిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 30, ఫిబ్రవరి 1, 3, 6 ,8 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తులిపారు. బీటెక్ (సీబీసీఎస్) మొదటి ఏడాది మొదటి సెమిస్టర్ రెగ్యూలర్, సప్లిమెంటరీ అభ్యర్థులందరూ పరీక్షలకు హాజరుకావాలని కోరారు. కేయూ క్యాంపస్ కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల, కేయూ క్యాంపస్ మహిళ ఇంజనీరింగ్ కళాశాల, మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

నర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ రూరల్, జనవరి 22: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్) జపాన్‌లో నర్సింగ్ ఉద్యోగాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం.మల్లయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24వ తేదీన ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తోందని బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, ఏఎన్ఎం, డిప్లొమా పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు.

జాతీయ స్వచ్ఛాగ్రహి అవార్డుకు ఎంపిక

జంగాలపల్లి సర్పంచ్ దంపతులకు ఢిల్లీ నుంచి ఆహ్వానం


అనిత-వినయ్‌కుమార్

ములుగు, జనవరి 22: ములుగు మండలం జంగాలపల్లి సర్పంచ్ మసర గాని అనిత, ఆమె భర్త వినయ్‌కుమార్‌కు అరుదైన అవకాశం దక్కనుంది. ఈనెల 26న ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలకు ప్రత్యేక అతిథులుగా పాల్గొనాలని కేంద్ర ప్రభుత్వం ఆహ్వానించింది. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా గ్రామంలో పారిశుధ్య పనులను విజయవంతంగా చేపట్టడం, ప్రభుత్వ పథకాలను అమలు చేయడంలో వంద శాతం చేపట్టడంతో స్వచ్ఛాగ్రహి అవార్డుకు ఎంపిక చేశారు. ఐదు వేల మంది జనాభా, 2,860 మంది ఓటర్లు, 1,150 ఇళ్లు కలిగిన జంగాలపల్లిలో ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి, అన్ని వీధుల్లో అంతర్గత రోడ్లు, సైడ్‌డ్రెయినేజీల నిర్మాణం జరిగింది. ఇటీవల గ్రామాన్ని సందర్శించి స్వచ్ఛభారత్ కేంద్ర బృందం దీనిపై సంతృప్తి వ్యక్తం చేసింది. బృందం సభ్యులు ఇచ్చిననివేదిక ఆధారంగా సర్పంచ్ దంపతులకు పురస్కారం దక్కనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఐదు గ్రామపంచాయతీలు, ఇద్దరు రాష్ట్ర కోఆర్డినేటర్లు ఈ అవార్డుకు ఎంపిక కాగా ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి జంగాలపల్లి పంచాయతీ ఒక్కటే ఉండటం విశేషం. ఈనెల 24 నుంచి 29 వరకు ఢిల్లీ పర్యటన కొనసాగనుండగా సర్పంచ్ అనితతో పాటు ఆమె భర్త వినయ్‌కుమార్ పాల్గొననున్నారు.

నేడు కేడీసీలో అతిథి

అధ్యాపక పోస్టులకు ఇంటర్వ్యూలు

కేయూ క్యాంపస్, జనవరి 22 : హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్, మైక్రో బయాలజీ సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టుకు అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో 55 శాతం మార్కులతో పాటు నెట్, స్లెట్, పీహెచ్‌డీ కలిగిన వారికి ఎంపికలో ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు జనవరి 23న మంగళవారం ఉదయం 11 గంటలకు ధృవపత్రాలతో పాటు ఒక సెట్ జిరాక్స్ పత్రాలతో ఇంటర్వ్యూలకు కళాశాలలో హాజరు కావాలని కోరారు.

నరికివేత సరే, తొలగింపేది..?

● విద్యుత్‌శాఖ - జీడబ్ల్యూఎంసీ మధ్య 'ట్రీ వార్' ● రోడ్ల పక్కనే రోజుల తరబడి చెట్ల కొమ్మలు ● తరలింపు మీదంటే మీదని ఇరు సంస్థల దాగుడుమూతలు ● సమన్వయ లోపంతో నగరవాసుల ఇబ్బందులు


వడ్డెపల్లి టీచర్స్ కాలనీలో రోడ్డుకు ఇరువైపులా పడి వున్న చెట్ల కొమ్మలు

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 22: విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను నరికివేస్తున్న విద్యుత్‌శాఖ.. ఆ తర్వాత వాటి తొలగింపును మాత్రం విస్మరిస్తోంది. నరికిన చెట్ల తొలగింపు వ్యవహారం బల్దియా, విద్యుత్ శాఖ మధ్య వివాదంగా మారింది. ఈ బాధ్యత మీదంటే.. మీదే అంటూ రెండు శాఖలు ఒకరిని ఒకరు నిందించుకుంటున్నాయి. రెండు శాఖల తీరుతో నగరవాసులు మాత్రం చెట్ల కొమ్మల నరికివేతతో సమస్యలను ఎదుర్కొంటున్నారు. రోజుల తరబడి చెట్ల కొమ్మలు తొలగించకపోవడంతో కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జీడబ్ల్యూఎంసీ, విద్యుత్‌శాఖల మధ్య..

నరికిన చెట్ల కొమ్మలను ఎవరు తొలగించాలనే వ్యవహారం కొన్నేళ్లుగా పరిష్కారం కావడం లేదు. విద్యుత్ శాఖ, బల్దియాల మధ్య ఈ అంశం పెద్ద రగడగానే పరిణమించింది. ఇరుశాఖలు పరస్పరం సహకారం, సమన్వయంతో వ్యవహరించడం లేదు. దీంతో సమస్య తీవ్రమై రెండు శాఖల మధ్య వార్ జరుగుతోంది.

విద్యుత్ శాఖ నిర్లక్ష్యం

విద్యుత్ శాఖ నరికిన చెట్ల కొమ్మలను తొలగించడం లేదు. ట్రీ కటింగ్ పేరుతో ఇష్టారాజ్యంగా చెట్ల కొమ్మలను నరికివేసి కాలనీల్లోని ఇళ్ల ముందే పడవేసి వెళ్తున్నారు. ఇదేమిటని కాలనీవాసులు ప్రశ్నిస్తే కూడా చెట్ల కొమ్మలు నరికిన వారు దురుసుగా సమాధానం ఇస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తరువాత తీస్తామని.. లేదంటే బల్దియా వారు తీస్తారంటూ సమాధానమిస్తున్నారు. మరోవైపు విద్యుత్ శాఖ వ్యవహారం బల్దియా తలనొప్పిగా మారింది.

బాధ్యత మరుస్తున్న విద్యుత్ శాఖ

వాస్తవానికి సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, స్వచ్ఛభారత్ మార్గదర్శకాల మేరకు చెట్ల కొమ్మలు నరికిన తరువాత విద్యుత్ శాఖ మాత్రమే వాటిని తొలగించాల్సి ఉంటుంది. లేనిపక్షంలో జీడబ్ల్యూఎంసీకి తొలగింపు చర్యల నిమిత్తం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈ విషయంలో ఇంటింటి నుంచి చెత్త సేకరణ, పన్ను మదింపు అంశాన్ని జీడబ్ల్యూఎంసీ ఉదహరిస్తోంది. ఇంటి నుంచి చెత్త సేకరణకు గాను ఆస్తిపన్నులో చెత్తపన్నును కలిపి వసూలు చేస్తున్న సంగతిని జీడబ్ల్యూఎంసీ ప్రస్తావిస్తోంది. ఇదేక్రమంలో విద్యుత్ శాఖ కూడా బల్దియా ద్వారా తొలగింపు జరగాలనుకుంటే ఈ మేరకు పన్ను రూపంలో చెల్లించాల్సి ఉంటుందని జీడబ్ల్యూఎంసీ స్పష్టం చేస్తోంది. అలాకాకుండా పన్ను విధించకపోవడం, సొంతంగా కొమ్మలను తొలగించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రూ.15లక్షల చెల్లింపు నోటీసుల జారీ

చెట్ల తొలగింపు జరిపిన క్రమంలో ఈ మేరకు రూ.15లక్షల పన్ను మదింపు విద్యుత్ శాఖకు జరిగింది. ఇటీవలే ఈ డిమాండ్ నోటీసులను విద్యుత్ శాఖకు జీడబ్ల్యూఎంసీ అందచేసినట్లు తెలిసింది. దీనిపై విద్యుత్‌శాఖ స్పందించడం లేదని బల్దియా చెబుతోంది. నిబంధనల మేరకు చెట్ల కొమ్మలు నరికిన క్రమంలో ఆ చెత్త తొలగింపు బాధ్యత విద్యుత్‌శాఖదే.. లేనిపక్షంలో తొలగింపు చేపట్టిన బల్దియాకు పన్ను అయినా చెల్లించాల్సి ఉంది.

కానీ విద్యుత్ శాఖ తీరు మాత్రం నగరవాసులకు సమస్యను తెచ్చిపెడుతోంది. ఒక డివిజన్‌లో విద్యుత్ శాఖ తొలగించిన కొమ్మలను తీసుకెళ్లేందుకు రోజుకు పది ట్రాక్టర్ ట్రిప్పులు అవసరం అవుతుందని బల్దియా చెబుతోంది. డివిజన్‌కు ఒకే ట్రాక్టర్ కేటాయింపు వల్ల ఈ సమస్య మరీ తీవ్రం అవుతోంది. చెట్ల తొలగింపునకే ట్రిప్పులు సరిపోకపోవడంతో రోజు వారి తొలగించే చెత్త మరో సమస్య బల్దియాకు ఎదురవుతోంది. పెద్ద పెద్ద కొమ్మలను ఇష్టారాజ్యంగా కాలనీల్లో రోడ్లపై పడవేయడం, ఆకులు ఎండి ఆ చెత్త ఇళ్లలోకి రావడం, చెట్లకొమ్మలు రోడ్లపై ఉండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ రెండు శాఖ మధ్య సమన్వయం లోపం నగర వాసులకు శాపంగా పరిణమించింది. జీడబ్ల్యూఎంసీ కమిషనర్, ఎన్‌పీడీసీఎల్ ఉన్నతాధికారులు చర్చించుకొని సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

నేటి నుంచి శ్రీలక్ష్మినరసింహుడి బ్రహ్మోత్సవాలు

గీసుగొండ, జనవరి 22: గీసుగొండ శ్రీలక్ష్మినరసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఏనుగులు సాంబరెడ్డి, అర్చకులు అర్చకులు వేదాంత వెంకటనరసింహాచార్యులు, మురళీకృష్ణమాచార్యులు తెలిపారు. 23న గీసుగొండ గ్రామంలోని ఆలయం నుంచి గుట్టపైకి ఉత్సవమూర్తులు చేరుట, కల్యాణోత్సవం, 24న హోమబలిహరణం, 25న పూర్ణాహుతి, రాత్రి జాతర బండ్లు తిరుగుట, మొక్కులు సమర్పించుట, 26న కేశఖండన, పుష్పయాగం, 27న ఉత్సవమూర్తులు గ్రామాలయానికి పునఃప్రవేశం జరుగునని వారు వివరించారు.

మైనారిటీ గురుకులంలో ప్రవేశాలకు ఆహ్వానం

శంభునిపేట, జనవరి 22 : శంభునిపేట దూపకుంట రోడ్‌లోని తెలంగాణ మైనారిటీ బాలికల గురుకులంలో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పొందవచ్చని ప్రిన్సిపాల్ తాళ్ళ నీలి మాదేవి అన్నారు. సోమవారం గురుకులంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 5వ తరగతితో పాటు ఇంటర్‌లో ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశాలకు మైనారిటీ, నాన్ మైనారిటీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 6,7,8 తరగతుల్లో మైనారిటీలకు బ్యాక్‌లాక్ ఖాళీలను భర్తీ చేయటానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. సంబంధిత ప్రభుత్వ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 77804 02391 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

మహాజాతరలో సేవలకు అవకాశం ఇవ్వండి

దేవాదాయ శాఖకు సింగరేణి కార్మికుల వినతి

మేడారం, జనవరి 22 : మేడారం మహా జాతరలో ఉచితంగా స్కౌట్ సేవలు అందించడానికి తమకు అవకాశం ఇవ్వాలని సింగరేణి భూపాలపల్లి ఏరియా కార్మికులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి, దేవాదాయ శాఖ మేడారం కార్యనిర్వాహక అధికారి రాజేంద్రంకు సోమవారం వినతిపత్రం అందజేశారు. గత జాతరలో జంపన్నవాగు పరిసరాల్లో భక్తులకు 90 మంది కార్మికులతో భక్తులకు ఉచిత సేవలు అందించామన్నారు. అవకాశం కల్పిస్తే ఈసారి మహాజాతరలో కూడా సేవలు అందిస్తామన్నారు.

బండారి సింగిడిలో కొమురవెల్లి

ఘనంగా పట్నంవారం పెద్దపట్నం, అగ్నిగుండాలు

నిప్పుల్లో చిందేసిన శివసత్తులు, పోతరాజులు, భక్తులు


అగ్నిగుండంలో చిందేస్తున్న శివసత్తులు, భక్తులు

చేర్యాల, జనవరి 22: కొమురవెల్లి మల్లిఖార్జునస్వామిని స్తుతిస్తూ శివసత్తులు, పోతరాజులు, భక్తులు కణకణమని రగిలే నిప్పుల్లో చిందులేసి మైమరచిపోయారు.. దేవుడు..మల్లన్న దేవుడు... అంటూ స్వామివారి నామస్మరణతో అశేష భక్త జనులు పులకించారు. దేవదేవుడి ఆవాహనంతో చేతిలో వీరకోలతో సిగమూగుతూ అగ్నిగుండాలు దాటి తన్మయత్వం చెందారు. భక్తిపారవశ్యంలో కొముర వెల్లి ఓలలాడింది. కొమురవెల్లి మల్లిఖార్జునస్వామి బ్రహ్మోత్సవాల ప్రారంభంలో భాగంగా పట్నంవారాన్ని పురస్కరించుకుని హైదరాబాదుకు చెందిన యాదవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆలయతోటబావి ప్రాంగణంలో మల్లన్నకు అత్యంత వైభవోపేతంగా పెద్దపట్నం వేసి అగ్నిగుండాలు నిర్వహించారు.

యాదవపూజారులు పసుపు, కుంకుమ, పచ్చ, బియ్యంపిండి, సునేరు, పంచ రంగులతో పెద్దపట్నాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. వంటచెరుకుతో అగ్నిగుండాలను తయారుచేశారు.పెద్దపట్నానికి చిత్రకన్ను అమర్చి గుమ్మడి కాయలను అష్టదిక్పాలకు లకు అలంకరించారు. మల్లన్న చరిత్ర, మహిమలను వివరిస్తూ యాదవపూజారులు ఒగ్గుకథను ఆలపించగా భక్తులు జయజయధ్వానాలు చేయడంతో ఆలయపరిసరాలు ప్రతిధ్వనించాయి. భక్తిప్రపత్తులతో వేస్తున్న పట్నాన్ని తిలకిస్తూ అశేష భక్తజనం పులకించిపోయారు. భక్తులు మల్లన్నను స్మరిస్తూ బండారిని వంటినిండా ధరించడంతో ఆలయ పరి సరాలన్నీ పసుపుమయంగా మారింది. పట్నం వేయడం, అగ్నిగుండాలను తయారు చేయడం పూర్తికాగానే గర్భాలయంనుంచి అర్చకులు మహదేవునిమల్లికార్జున్ తదితరులు ఉత్సవవిగ్రహాలను పోలీసు బందోబస్తు నడుమ తీసుకు వచ్చి పట్నంచుట్టూ ప్రదక్షిణలు చేశారు. యాదవులు గుమ్మడికాయలను బలిహరణ చేయగానే అర్చకులు అగ్నిగుండాలను దాటడం ప్రారంభించారు. అనంతరం మల్లన్నను స్మరిస్తూ అగ్నిగుండాలను దాటి స్వామివారిని దర్శించుకు న్న శివసత్తులు, భక్తులకు ఆలయ సంప్రదాయం ప్రకారం ఈవో బాలాజీశర్మ, పునరుద్ధరణ కమిటీ సభ్యులు తదితరులు కనుములు(ఆచారం) అందించి సత్కరించారు. పలువురు భక్తులు బెల్లంపానకం, నీళ్లప్యాకెట్లను, మరికొందరు అన్నదానం వితరణ చేశారు. బండారిని పంపిణీ చేశారు.

మేడారంలో ప్లాస్టిక్ నిషేధంపై సమీక్ష




సమీక్షలో మాట్లాడుతున్న డీపీవో వెంకయ్య

మేడారం, జనవరి 22 : మేడారం మహాజాతరలో ప్లాస్టిక్ నిషేధంపై భక్తులకు అవగాహన చేసేందుకు ములుగు డీపీవో వెంకయ్య సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మొబలైజర్లు ఇందులో పాల్గొనగా ఏటూరునాగారం ఐటీడీఏ పెసా కోఆర్డినేటర్ కొమురం ప్రభాకర్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ మేడారం మహాజాతరకు సుమారు కోటిన్నర మంది భక్తులు మేడారం తరలివచ్చి విడిది చేస్తారని అన్నారు. వారు వదిలిన వ్యర్థాలతోపాటు ప్లాస్టిక్ అధికంగా ఉంటుందని తెలిపారు. ప్లాస్టిక్ ఫ్రీ మహాజాతరను నిర్వహించుకునేందుకు మొబలైజర్లు కృషి చేయాలన్నారు. భక్తులకు ప్లాస్టిక్ ప్రత్యామ్నాయాలను చూపడానికి స్వచ్ఛంద సేవా సంస్థలతో పాటు ఐటీడీఏ ఏటూరునాగారం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోందని అన్నారు. ఇందులో భాగంగా జ్యూట్ బ్యాగుల వినియోగంపై భక్తులకు, వ్యాపారులకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్లాస్టిక్ నిషేధాన్ని పాటించని వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీవో రహీం, పెసా కమిటీ జిల్లా అధ్యక్షులు, వివిధ మండలాల అధ్యక్షులు, గ్రామపంచాయతీల మొబలైజర్లు పాల్గొన్నారు.

విద్యార్థులపై వీధికుక్కల దాడి

ఇద్దరు విద్యార్థులకు గాయాలు


శునకాల దాడిలో గాయపడిన విద్యార్థులు

సుబేదారి, జనవరి 22 : నగరంలో వీధి కుక్కల దాడులు నిత్య కృత్యమవుతున్నాయి. రెండు రోజులు దాటకముందే మళ్లీ కుక్కలు విజృంభించాయి. ఆదివారం వరంగల్ 21వ డివిజన్ లోని ఎల్‌బీ నగర్‌లో అలీ అక్బర్, అనాస్ అనే ఇద్దరు చిన్నారులపై కుక్కల దాడి చేసి గాయపరిచిన ఘటన తెలిసిందే. అలాగే గత వారం రోజుల క్రితం న్యూశాయంపేట జంక్షన్ నుంచి పద్మాక్షి టెంపుల్‌కు వెళ్లే రోడ్డు పక్కన ఉన్న కాలనీలో ముగ్గురు వ్యక్తులను గాయపరిచాయి. ఈ రెండు ఘటనలు మరువక ముందే తాజాగా సోమవారం హనుమకొండ హంటర్‌రోడ్‌లోని వెల్లండి కాలనీకి చెందిన వి. శ్రీహిత, ఎస్. దేవిప్రసాద్‌లు ఓ ప్రైవేటు పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నారు. కాగా, సోమవారం ఇద్దరు ఇంటి ఆవరణలో ఆడుకుంటుండగా ఒక్కసారిగా శునకాలు మీద పడి దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన విద్యార్థులకు టీటీ ఇంజక్షన్లు ఇప్పించినట్లు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నయీంనగర్, జనవరి 22: ఎన్‌పీడీసీఎల్ హనుమకొండ డివిజన్ 11కేవీ మెయింటెనెన్స్‌లో భాగంగా బాలసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలోని బాలసముద్రం, చిల్డ్రన్స్ పార్కు ఏరియా, మునిసిపల్ కమిషనర్ క్యాంపు ఆఫీస్, ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నారు. ఈ మేరకు హనుమకొండ డివిజన్ ఇంజనీర్ ఎలక్ట్రికల్, ఆపరేషన్స్ జి.సాంబరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

● అలాగే ఎన్‌పీడీసీఎల్ వరంగల్ డివిజన్ 11కేవీ మెయింటెనెన్స్‌లో భాగంగా క్రిష్ణా కాలనీ, స్టేషన్‌రోడ్, వరంగల్ చౌరస్తా, రామ్‌కీ, గ్రేన్ మార్కెట్, దయానంద్ కాలనీ, లక్ష్మీపురం, శివనగర్, ఏఎస్ రెడ్డినగర్, రంగశాయిపేట, మహంకాళి గుడి ఏరియా, హంస బేకరీ, గొల్లవాడ, కుమ్మరివాడ, నాయుడు పంపు, గణపతి ఇంజనీరింగ్ కాలేజీ, పెరుకవాడ చమన్, ఎస్‌ఆర్‌ఆర్ తోట, బీరన్నకుంట, మామునూర్ టౌన్, కుమ్మరిపల్లి, గవర్నమెంట్ డైరీ ఫామ్, పీవీ ఎన్‌ఆర్ వెటర్నరీ కాలేజీ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నారు. అదేవిధంగా రామన్నపేట, బట్టల బజార్, ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్, ఓఎస్.నగర్, పాపయ్యపేట చమన్, దేశాయిపేట, బాలాజీనగర్, ఎంహెచ్ నగర్, నజరేత్‌పుర, కొత్తవాడ, డాక్టర్స్‌కాలనీ, బ్యాంక్ కాలనీ, మర్రివెంకటయ్య కాలనీ, రామ్‌నాథ్‌పురి, ఫిల్టర్‌బెడ్ ఏరియా ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నారు. ఈ మేరకు ఎలక్ట్రికల్, ఆపరేషన్ వరంగల్ డివిజనల్ ఇంజనీర్ శంకేశి మల్లికార్జున్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గురుకుల ప్రవేశానికి నేడు చివరి గడువు

హనుమకొండ రూరల్, జనవరి 22 : గురుకుల విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తులకు ఈ నెల 23వ తేదీ చివరి అవకాశమని వరంగల్ రీజియన్ ప్రాంతీయ సమన్వయ అధికారి ఎస్.విద్యారాణి ఒక ప్రకటనలో తెలిపారు. www.tswreis.ac.in, www.tsswreisjc.cgg.gov.in ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రేపు గణిత టాలెంట్ టెస్ట్


హనుమకొండ రూరల్, జనవరి 22: ఈ నెల 24న గణిత టాలెంట్ టెస్ట్ నిర్వహించాలని గణిత ఫోరం బాధ్యులు జిల్లా అధ్యక్షుడు తౌటం భాస్కర్, ప్రధాన కార్యదర్శి బోయినపల్లి మహేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు ప్రభుత్వ, జిల్లా, మోడల్ స్కూల్స్, రెసిడెన్షియల్ స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు, గణిత ఉపాధ్యాయులు ప్రతీ పాఠశాల నుంచి ముగ్గురు తెలుగు మీడియం నుంచి, మరో ముగ్గురు ఇంగ్లీష్ మీడియం నుంచి అనుమతించాలన్నారు. 24న ఉదయం టెస్ట్ నిర్వహించి వెంటనే ఫలితాలు ప్రకటించాలన్నారు. ప్రతి మండలం నుంచి గెలుపొందిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ నెల 27వ తేదీన రీజినల్ సైన్స్ సెంటర్‌లో జరిగే టాలెంట్ టెస్ట్‌కు విద్యార్థులను పంపాల్సి ఉంటుందని వారు పేర్కొన్నారు.

26న చేపట్టే కిసాన్ ర్యాలీలో పాల్గొనండి

గిర్మాజిపేట, జనవరి 22 : ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా ఈనెల 26న చేపట్టిన కిసాన్ వాహన ర్యాలీలో రైతులు పాల్గొనాలని మోర్చా రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేష్ పిలుపునిచ్చారు. సోమవారం వరంగల్ హెడ్‌పోస్టాఫీసు సమీపంలోని ఓంకార్ భవన్‌లో చిర్ర సూరి అధ్యక్షతన జరిగిన సంయుక్త కిసాన్ మోర్చా, వివిధ కార్మిక సంఘాల బాధ్యుల సమావేశంలో రమేష్ కేంద్ర రైతు వ్యతిరేక విధానాలను దుయ్యబట్టారు. కనీస మద్దతు ధర, రుణ విముక్తి చట్టాల కోసం దేశ వ్యాప్తంగా రైతు సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చాగా ఏర్పడి ఉద్యమాలు చేస్తున్నాయన్నారు. ఇందులో భాగంగా ఈనెల 26న రిపబ్లిక్ డే రోజున దేశవ్యాప్తంగా 500 జిల్లాల్లో కిసాన్ వాహన ర్యాలీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఫిబ్రవరి 10న గ్రామీణ బంద్ పాటిస్తున్నట్లు చెప్పారు. 26న వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి జరిగే కిసాన్ వాహన ర్యాలీలో వరంగల్ జిల్లా రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పి.రమేష్ పిలుపునిచ్చారు. సమావేశంలో రైతు, కార్మిక, ప్రజాసంఘాల బాధ్యులు గోనే కుమారస్వామి, రాచర్ల బాలరాజు, వీరగోని శంకరయ్య కుసుంబ బాబురావు, భూక్య సమ్మయ్య,ఓదెల రాజన్న, ఈర్లపైడి తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యకు పాదయాత్ర

నెక్కొండ నుంచి పాదయాత్ర చేపట్టిన సర్దార్‌సింగ్


పాదయాత్రతో బయలుదేరిన సర్దార్‌సింగ్

నెక్కొండ, జనవరి 22 : దేశంలో రామరాజ్యం రావాలని, హిందువులందరూ సనాతన ధర్మాన్ని కాపాడాలని కోరుతూ నెక్కొండ మండలం పత్తిపాక గ్రామానికి చెందిన రైతు జరుపుల సర్దార్‌సింగ్ సోమవారం నెక్కొండ నుంచి అయోధ్యకు పాదయాత్రను చేపట్టారు. ప్రతీ హిందువు నిత్యం జైశ్రీరాం అన్నప్పుడే తన పాదయాత్ర సఫలీకృతమౌతుందన్నారు. రామ భక్తుడైన తాను శ్రీరాముడి ఆజ్ఞమేరకే తాను ఈ పాదయాత్ర చేపట్టానన్నారు. నెక్కొండ నుంచి అయోధ్యకు 1300 కిలో మీటర్లు ఉంటుందని ప్రతీ రోజు 60 నుంచి 70 కిలోమీటర్లు నడుస్తానన్నారు. ఈ పాదయాత్రను సర్దార్‌సింగ్ చెప్పులు లేకుండా చేస్తున్నారు. శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో రామభక్తులు సర్దార్‌సింగ్ యాత్ర విజయవంతం కావాలని కోరుకుంటూ ఘనంగా సన్మానించారు.

రామాలయంలో ముస్లింల పూజలు


చెన్నారావుపేటలోని శ్రీరామ ఆలయంలో పూజలు చేసిన ముస్లింలు

చెన్నారావుపేట, జనవరి 22 : అయోధ్యలో శ్రీ బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీరాముని ఆలయంలో ఓ ముస్లిం కుటుంబం ప్రత్యేక పూజలను చేసింది. గ్రామానికి చెందిన మహమ్మద్ సుబాన్, నసీమా బేగం దంపతులు కుటుంబంతో వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాముని విగ్రహ ప్రతిష్ఠాపన రోజున మతాలకు అతీతంగా రామునికి పూజలు చేయటంపై ఆ కుటుంబాన్ని పలువురు అభినందించారు.

అంతా రామమయం

వాడవాడలా మార్మోగిన రామనామం ● వైభవంగా శోభాయాత్రలు ● ఆలయాల్లో పూజలు, శ్రీరాముడి కల్యాణ మహోత్సవాలు


స్టేషన్‌ఘన్‌పూర్‌లో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు


తిమ్మంపేటలో శ్రీ సీతారామస్వామి కల్యాణంలో పాల్గొన్న గ్రామస్థులు


పల్లగుట్టలో గ్రామస్థులతో కలిసి హోమపూజ చేస్తున్న పొట్లపల్లి శ్రీధర్‌రావు


జీడికల్‌లో శ్రీరాముడి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, హాజరైన భక్తులు


జనగామ బార్ అసోసియేషన్‌లో రామ విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జనవరి 22: అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి పట్టణాల్లో భక్తులు పరవశించి పోయారు. వాడవాడన వైభవంగా పండుగ వాతావరణంలో వేడుకలు జరుపుకున్నారు. స్థానిక శ్రీ తిరుమలనాథస్వామి దేవాలయం, శివునిపల్లి నగరేశ్వరాలయం, శ్రీ వేంకటేశ్వరాలయంలో ఉదయం నుంచే భక్తులు భక్తి శ్రద్ధలతో శ్రీ రామునికి ప్రత్యేక పూజలు చేశారు. నగరేశ్వరాలయం నుంచి వివేకానంద చౌరస్తా వరకు భక్తులు సాంప్రదాయ దుస్తులు ధరించి పెద్ద ఎత్తున పాల్గొని జై శ్రీరాం నినాదాలతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని బీజేపీ నేత బొజ్జపల్లి సుభాష్, మాజీ జడ్పీటీసీ గోరంటల బలరాం ప్రారంభించారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో తిరుమల నాథస్వామి దేవాలయం నుంచి శివాజీ విగ్రహం వరకు సాయంత్రం శోభాయాత్ర చేపట్టారు. శోభాయాత్రల్లో రామజన్మ భూమి ట్రస్ట్, వీహెచ్‌పీ, భజరంగ్ దళ్, ఏబీవీపీ, వికాస తరంగిణి నాయకులు డాక్టర్ హేమంత్ రాజు, కె.సదానందచారి, గోనెల రమేశ్, జి.అరవింద్, ఇ.గణేష్‌రెడ్డి, వి.తిరుమల శ్రీనివాస్, కె.వేణు, ఎన్.వెంకట్రాంనర్సయ్య, సర్పంచ్ బూర్ల విష్ణు, రంగారావు, శేఖర్ శర్మ, జి.కృష్ణమూర్తి, కత్తి శ్రీనివాస్, గోలి రాజశేఖర్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యకు ఉన్నంత చరిత్ర వల్మిడికి ఉంది: మాజీ మంత్రి ఎర్రబెల్లి

పాలకుర్తి: అయోధ్యలోని శ్రీరాముడి ఆలయానికి ఉన్న చరిత్ర జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని వల్మిడి సీత రామచంద్రస్వామి ఆలయానికి ఉందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం ఆయన వల్మిడి గ్రామంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొద్ది రోజుల్లోనే భద్రాచలం కంటే వల్మిడి ఆలయం అధిక ప్రాచుర్యం పొందుతుందని అన్నారు. కార్యక్రమంలో పాలకుర్తి, రాయపర్తి ఎంపీపీలు నల్ల నాగిరెడ్డి, అనిమిరెడ్డి, జడ్పీటీసీ శ్రీనివాసరావు, బీఆర్ఎస్ నాయకులు పసునూరి నవీన్, వీరమనేని యాకాంతరావు, పసునూని నవీన్ పాల్గొన్నారు. అనంతరం వెయ్యి మందికి ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

శ్రీ రాముల ట్రస్టు వ్యవస్థాపకులు దొంగరి మహేందర్, కమ్మగాని శ్రీకాంత్ ఆధ్వర్యంలో సోమవారం శ్రీ సోమేశ్వరలక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం నుంచి గుడవాడ చౌరస్తా మీదుగా రాజీవ్ చౌరస్తా వరకు శోభాయాత్రను నిర్వహించారు. విచిత్ర వేషాధారణ, సంప్రదయాల నృత్యాలతో చిన్నారులు ఆకట్టుకున్నారు. అనంతరం 3 వేల మందికి అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. శోభాయాత్రలో రాపాక విజయ్, రఘు, దొడ్డ మధు, వెంకన్న, నంగునూరి మధు, మణికంఠ సోమన్న పాల్గొన్నారు.

జఫర్‌గడ్: అయోధ్యలోని రామమందిరంలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా గ్రామాల్లో ఆలయాల్లో పూజలు, అర్చనలు చేశారు. శ్రీరాముని, హనుమాన్ ఆలయాలతో పాటు వివిధ ఆలయాలను శుభ్రపరిచారు. భక్తుల శ్రీరామ నామస్మరణతో ఆలయాలు మారుమోగాయి. జఫర్‌గడ్, తిమ్మంపేట, కూనూరు, తమ్మడపల్లి(జి), షాపల్లి, తదితర గ్రామాల్లోని శ్రీరామచంద్రస్వామి, హనుమాన్ ఆలయాల్లో ఆలయాల్లో కల్యాణ వేడుకలను వైభవంగా నిర్వహించారు.

లింగాలఘణపురం: మండలంలోని అన్ని గ్రామాల్లో శ్రీరాముడి భక్తులు వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రసిద్ధ జీడికల్ శ్రీరామచంద్రస్వామి ఆలయంలో శ్రీరాముడి కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. నెల్లుట్లలో ఎంపీపీ చిట్ల జయశ్రీఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీరామ కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీనివాసనగర్ కాలనీలో శ్రీరామ కల్యాణం నిర్వహించిన భక్తులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నవాబుపేటలో ఆలయాధికారులు శ్రీరామకల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అదే విధంగా వడ్డిచర్ల, లింగాలఘణపురం, చీటూరు, వనపర్తి తదితర గ్రామాల్లో శ్రీరామ భక్తులు శ్రీరాముడి శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు.

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని శ్రీఅభయంజనేయ స్వామి విగ్రహానికి శ్రీమహాదేవ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ కూరెల్లి పెద్దఉపేందర్‌తో పాటు పలువురు భక్తులు ప్రత్యేక పూజలు చేసి శ్రీరామ నామాన్ని జపించారు. ఇప్పటికే ఇంటింటికీ అయోధ్యలో పూజించిన అక్షింతలను పంపిణీ చేయగా, వాటిని ప్రజలు భక్తిశ్రద్ధలతో తలపై చల్లుకొని శ్రీరాముడిపై ఉన్న భక్తి భావాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో పడకంటి రవిందర్, కూరెల్లి పెద్దఉపేందర్, బచ్చు చిరంజీవులు, శ్యాంశెట్టి శంకరయ్య, గందె లిరిల్ కుమార్, వేద కుమార్, వినయ్ కుమార్ పాల్గొన్నారు.

కొడకండ్ల: మండలకేంద్రంలోని రామాలయంలో ఎల్‌ఈడీ తెరను ఏర్పాటు చేసి ప్రాణప్రతిష్ఠ ఉత్సవాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయడంతో రామభక్తులు వందల సంఖ్యలో పాల్గొని వీక్షించారు. ఉదయం నుంచే పూజారులు అర్చనలు, ప్రత్యేక పూజలు, పురుష సూక్త పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శింగరం చంద్రయ్య, ఎస్.కోటేశ్వర్, ఎస్.రాములు, దామెర శ్రీనివాస్, నవీన్, రమేశ్, రవీందర్, సతీష్, దూలం సతీష్, కోటగిరి అనిల్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

దేవరుప్పుల: మండలంలోని పెద్దమడూరులో శ్రీరాముడి విగ్రహాలతో పురవీధుల గుండా శోభయాత్ర నిర్వహించారు. అదే విధంగా సీతారాంపురంలో ఆంజనేయ స్వామి ఆలయం నుంచి గ్రామంలో శ్రీరాముని చిత్రపటంతో ఊరేగించారు.

తరిగొప్పుల: మండలంలో ఆదివారం రాత్రి నుంచే భక్తులు రామాలయాలు, హనుమాన్ దేవాలయాలను వేడుకలకు ముస్తాబు చేశారు. నర్సాపూర్‌లో అల్లిబిల్లి భార్గవి ప్రసాద్‌కుమార్ ఆధ్వర్యంలో మహా అన్నదానం చేశారు. వేదపండితులు సీతారాములు విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకం చేసి గ్రామంలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని కొత్తపల్లి అభయాంజనేయ స్వామి దేవాలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. స్థానిక సర్పంచ్ గోవిందు ఆనందం, ఎంపీటీసీ బెల్లపు వెంకటస్వామి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి హోమపూజ చేపట్టారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

నర్మెట: మండలకేంద్రంలోని హనుమాన్ దేవాలయం నుంచి శ్రీరాముని చిత్రపటంతో గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జై శ్రీరాం అంటూ నినాదాలు చేశారు. మండకేంద్రానికి చెందిన చిర్ర మహిపాల్‌రెడ్డి హనుమాన్ దేవాలయంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో నర్మెట సర్పంచ్ ఆమెడపు కమలాకర్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు ధరావత్ రాజు, సీతారామ భజన మండలి సభ్యులు, అన్ని గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

చిలుపూర్: మండలంలోని పల్లగుట్ట, మల్కాపూర్ గ్రామాల్లోని హనుమాన్ దేవాలయాల్లో బుగులు వెంకన్న ఆలయ శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు, ముక్కెర గోపాల్, వేల్పుల రాజు, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు ఏడవెళ్లి మాధవరెడ్డి ఆధ్వర్యంలో హోమపూజ, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. అదేవిధంగా నష్కల్ సీతారామచంద్ర స్వామి ఆలయంతో పాటు, చిలుపూర్ గుట్ట బుగులు వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో స్థానిక సర్పంచులు కర్ణకంటి స్వప్న వెంకటేశ్, ఉద్దెమారి రాజ్‌కుమార్ నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పూజారులు బ్రాహ్మణపల్లి రవిందర్ శర్మ, ఎనమల వెంకటస్వామితో పాటు, సంగోజు మోహనాచారి - శంకరలక్ష్మి, మాదంశెట్టి కనకతార, షమాదేవి, తోకల సంపత్‌రెడ్డి - కరుణ, సాదం వేణు, బత్తిని రాజు, సంపత్, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట: మండలంలో గ్రామగ్రామాన శ్రీరామనామం మారుమోగింది. భక్తి పాటలు, భజనలు సంకీర్తనలతో భక్తజనం పైమరిచిపోయారు. తెల్లవారుజాము నుంచి ఆలయాలలో అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో వెంటరాగా, శ్రీరాముడి విగ్రహాలను పల్లకీలలో ఊరేగించారు. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపనను మినీ స్క్రీన్‌లపై వీక్షించారు.



మల్కాపూర్‌లో పూజలు చేస్తున్న రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నాయకుడు ఎడవెళ్ల మాధవరెడ్డి, వల్మిడి రాములోరి గుడిలో భజన చేస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు


రఘునాథపల్లిలో పూజలు చేస్తున్న భక్తులు


జనగామ ఉమా మహేశ్వర స్వామి దేవాలయంలో రామ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో పాల్గొన్న కలెక్టర్


పెద్దమడూరులో శోభాయాత్ర నిర్వహిస్తున్న గ్రామస్థులు


కొడకండ్ల రామాలయంలో పూజలో పాల్గొన్న భక్తులు


పాలకుర్తి శోభాయాత్రలో పాల్గొన్న చిన్నారులు


తరిగొప్పుల మండలకేంద్రంలో సీతారాముల విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

విద్యార్థులకు గణిత ప్రతిభా పరీక్షలు

జఫర్‌గడ్, జనవరి 22 : మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో సోమవారం మండల స్థాయి గణిత టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. గణిత ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలను మండల నోడల్ అధికారి ఎండి.పర్వేజ్ ప్రారంభించారు. కాగా, మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు ఆదర్శ, కస్తూర్బా విద్యాలయాల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా ఈ గణిత ప్రతిభా పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులను అందజేశారు. వీరు ఈనెల 27న జనగామలో జరిగే జిల్లా స్థాయి గణిత టాలెంట్ టెస్ట్‌లో పాల్గొంటారని గణిత ఫోరం కన్వీనర్ పెనుమాటి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు గణేష్‌రెడ్డి, సీతారామయ్య, సదానందం, గణిత ఉపాధ్యాయులు కృష్ణమోహన్, వెంకటేశ్వర్లు, వసంత, సుష్మిత, మమత, రాజు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్: శివునిపల్లి హైస్కూల్‌లో సోమవారం మండల స్థాయి గణిత టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ప్రభుత్వ హైస్కూళ్ల నుంచి టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థుల నుంచి మెరిట్ సాధించిన వారిని జిల్లా స్థాయి టెస్ట్‌కు ఎంపిక చేశారు. ఇంగ్లీష్ మీడియం నుంచి అల్మాస్ మోహియుద్దీన్(శివునిపల్లి హైస్కూల్), సిహెచ్ భాస్కర్ (చాగల్ హైస్కూల్), పి.అమృత వర్షిని(మోడల్ స్కూల్), డి.నిఖిల్(ఇప్పగూడెం హైస్కూల్), తెలుగు మీడియం నుంచి ఎం.వంశీ కృష్ణ, జి.నగేష్(శివునిపల్లి హైస్కూల్) ఎంపికయ్యారని నిర్వాహకులు ప్రకటించారు.

బచ్చన్నపేట: గణిత మేధావి శ్రీనివాస రామనుజన్ జన్మదినాన్ని పురష్కరించుకుని తెలంగాణ గణిత ఫోరం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని పదవ తరగతి విద్యార్థులకు బచ్చన్నపేట హైస్కూల్‌లో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. విద్యార్థుల్లో గనితం పట్ల అవగాహన కోసం, ఈ టెస్ట్ నిర్వహించామని ఫోరం మండల అధ్యక్షులు లింగం తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు వరుణ్ ఆదర్శ పాఠశాల (బచ్చన్నపేట), అరవింద్ (కట్కూరు), సీహెచ్ ప్రణయ్‌కుమార్ (పోచన్నపేట) నిలిచారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ మూర్తి, హెచ్‌ఎం వేణు, గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


స్టేషన్‌ఘన్‌పూర్‌లో కొవ్వొత్తులతో ర్యాలీ తీస్తున్న కాంగ్రెస్ నాయకులు


పాలకుర్తిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అసోం సీఎం క్షమాపణ చెప్పాలి: కాంగ్రెస్

జనగామ టౌన్, జనవరి 22: భారత్‌జోడో యాత్ర చేస్తున్న ఏఐసీసీ నేత రాహుల్ గాంధీపై బీజేపీ కార్యకర్తలను ఉసిగొల్పి యాత్రను అడ్డుకున్న అసోం సీఎం బిశ్వశర్మ వెంటనే క్షమాపణ చెప్పాలని జనగామ కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రాత్రి కాంగ్రెస్ ఆధ్వర్యంలో జనగామలోని నెహ్రూ పార్క్ నుంచి ఆర్టీసీ చౌరస్తా వరకు నల్ల చొక్కాలు ధరించి కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం అస్సాం సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, ఉడుత రవియాదవ్, మేడ శ్రీనివాస్, బనుక శివరాజ్‌యాదవ్, వంగాల మల్లారెడ్డి, మిద్దెపాక స్టాలిన్, కౌన్సిలర్ రాచందర్, చెంచారపు బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: అసోంలో రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రను అడ్డుకున్నందుకు నిరసనగా సోమవారం స్టేషన్‌ఘన్‌పూర్‌లో కొవ్వొత్తులతో కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన ర్యాలీ చేపట్టారు. శివాజీ విగ్రహం నుంచి బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించిన ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు నాగరబోయిన శ్రీరాములు, బ్లాక్ ఇన్‌చార్జీలు, మండల శాఖ అధ్యక్షులు, మండల ఇన్‌చార్జిలు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు పాల్గొన్నారు.

పాలకుర్తి: అసోంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జోడోయాత్రను బీజేపీ నాయకులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కొవ్వత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి మాట్లాడుతూ జోడో యాత్రలో జనాదరణను చూసి ఓర్వలేకనే బీజేపీ అడ్డుకుందని విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో గంగు కృష్ణమూర్తి, గడ్డం యాకసోమయ్య, అనుముల మల్లారెడ్డి, పునుగొండ రమేష్, పోగు శ్రీనివాస్, జలగం కుమార్, హరీష్, కమ్మగాని నాగయ్య, మనెమ్మ, భాస్కర్ పాల్గొన్నారు.

కొడకండ్ల: రాహుల్ గాంధీ జోడోయాత్రను అసోంలో బీజేపీ నాయకులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ కొడకండ్లలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు దారావత్ సురేష్ నాయక్ ఆధ్వర్యంలో అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోడో యాత్రలో రాహుల్ వెంట నడుస్తున్న ప్రజానీకాన్ని చూసి బీజేపీ నాయకులు జీర్ణించుకోలేదని విమర్శించారు. జోడోయాత్రను అడ్డుకోవడాన్ని అప్రజాస్వామికమన్నారు. కార్యక్రమంలో రాజేష్‌నాయక్, సుధీర్ నాయక్, మచ్చ మల్లేష్, శ్రీనివాస్, సోమన్న, హేమని పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి కడియం ఆర్థిక సాయం

జఫర్‌గడ్, జనవరి 22 : మండలంలోని తమ్మడపల్లి(ఐ)లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్ఎస్ నాయకుడు గాలి జయరెడ్డి కుటుంబానికి ఎమ్మెల్సీ కడియం శ్రీహరి ఆర్థిక సాయం అందించారు. సోమవారం స్థానిక గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ గాదెపాక సుధాకర్ ద్వారా రూ.10 వేలు బాధిత కుటుంబీకులకు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తుమ్మ రవికుమార్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ కొత్త రవి, గంగుల భూపాల్‌రెడ్డి, రవి, దేవయ్య, యాదవరెడ్డి, కలకోట రవి, వాసం సత్యనారాయణ, గోనె రాజిరెడ్డి, అబ్దుల్లా పాల్గొన్నారు.

స్నేహితురాళ్ల కుటుంబానికి చేయూత

బచ్చన్నపేట, జనవరి 22: తమతో కలిసి చదువుకున్న స్నేహితురాళ్ల తండ్రి అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాలకు తోటి విద్యార్థులు అండగా నిలిచారు. మండలంలోని కట్కూరు గ్రామానికి చెందిన పోలోజు సత్యనారాయణ ఇటీవల మృతి చెందాడు. వారిది పేద కుటుంబం కావడంతో ఆయన కూతుళ్లు సుజాత, మమతతో పాటు 2004-05 సంవత్సరంలో కట్కూరులో పదవ తరగతి చదువుకున్న స్నేహితులు రూ. 22 వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో ముసిని రాజుగౌడ్, కోనేటి స్వామి, దూసరి సాయి, నర్సింహులు, సతీష్, శ్రీశైలంగౌడ్, రాంబ్రహ్మం, రవి, కరుణాకర్, నాగరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం పని చేశాం

నర్మెట, జనవరి 22: ఐదేళ్ల కాలంలో గ్రామ ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా తమ పాలకవర్గం పని చేసిందని నర్మెట సర్పంచ్ ఆమెడపు కమలాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎనభై శాతం సీసీ రోడ్లను నిర్మించామని, ప్రజలకు తాగునీటి, వీధి దీపాల సమస్య తలెత్తకుండా చేశామని, అంతేగాకుండా సొంత నిధులతో చౌరస్తాలో పబ్లిక్ టాయిలెట్స్, బస్‌షెల్టర్ నిర్మాణం చేశామని అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఐదేళ్ల కాలంలో గ్రామ అభివృద్ధిలో తనకు సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోపగోని శ్రీనివాస్, వార్డు సభ్యులు, అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సీజేఐటీ అధ్యాపకుడికి డాక్టరేట్


ప్రణయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న సీజేఐటీ డైరెక్టర్ విజయపాల్‌రెడ్డి

జనగామ కల్చరల్, జనవరి 22: క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాల (సీజేఐఈటీ) అధ్యాపకుడు బి.వి.ప్రణయ్‌కుమార్‌ను డాక్టరేట్ వరించింది. జనగామ మండలం యశ్వంతాపురంలో సీఎస్ఈ విభాగంలో అధ్యాపకుడిగా పని చేస్తున్న ప్రణయ్‌కుమార్ 'సెంటిమెంట్ అనాలసిస్ యూజింగ్ లింగ్విస్టిక్, సోషల్ ఆట్రిబ్యూట్స్ అండ్ డీప్ లర్నింగ్ ట్రాన్స్‌ఫార్మర్ టెక్నిక్స్' అనే అంశంపై సమర్పించిన సిద్ధాంత వ్యాసానికి గాను ఆయన డాక్టరేట్ అందుకున్నారు. కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎం.సదానందం పర్యవేక్షణలో కేయూ కంప్యూటర్ అండ్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం డాక్టరేట్ అందించింది. ఈ మేరకు కేయూ పరీక్షల నియంత్రణ అధికారి పి.మల్లారెడ్డి పట్టా అందించి సత్కరించారు. ఈ సందర్భంగా సీజేఐటీ డైరెక్టర్ విజయపాల్ రెడ్డి సోమవారం కళాశాలలో ఆయనను శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.చంద్రశేఖర్ రెడ్డి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

వేం నరేందర్‌రెడ్డిని కలిసిన రవియాదవ్


నరేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న రవియాదవ్

జనగామ టౌన్, జనవరి 22: ప్రభుత్వ ముఖ్య సలహాదారుడిగా నియమితులైన వేం నరేందర్‌రెడ్డిని జనగామ జిల్లా కాంగ్రెస్ నేత ఉడుత రవియాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తలిపారు. జనగామ అభివృద్ధికి తమ వంతు తోడ్పాటునందించాలని రవియాదవ్ కోరారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

దేవరుప్పుల, జనవరి 22: మండలంలోని సింగరాజుపల్లిలో మంగళవారం విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహించనున్నట్లు ఏడీఈ అనిల్‌కుమార్ తెలిపారు. ఇందులో విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్స్‌ను మార్చడం, వోల్టేజీ హెచ్చుతగ్గులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ పెంపుదల, లోపాలు ఉన్న మీటర్లు మార్చడం, నూతన సర్వీసుల మంజూరు. అదనపులోడ్ క్రమబద్ధీకరణ, సర్వీసు పేరు మార్పు తదితర సమస్యలపై దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రేపటి నుంచి వార్డు కమిటీల ఎన్నిక

జనగామ టౌన్, జనవరి 22: డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 24 నుంచి జనగామ పట్టణంలో కాంగ్రెస్ వార్డు కమిటీలను ఎన్నుకోనున్నట్లు పట్టణ ఎన్నికల కమిటీ పరిశీలకుడు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ప్రకటించారు. రోజుకు మూడు వార్డుల చొప్పున ఫిబ్రవరి 3 లోపు కమిటీలు పూర్తి చేస్తామన్నారు.

'లక్ష్యం' ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

కొడకండ్ల, జనవరి 22: నాబార్డ్ సహకారంతో 'లక్ష్యం' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా బ్లాక్ ప్రింటింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ చైర్మన్ శంకర్ తెలిపారు. మండలకేంద్రంలోని పద్మశాలిభవన్‌లో సోమవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ 18-45 ఏండ్ల మహిళలకు 15 రోజులు పాటు బ్లాక్ ప్రింటింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సీఈవో లత, పద్మశాలి సొసైటీ అధ్యక్షుడు చెన్న ఉపేందర్, పద్మశాలి పెద్దలు ఎం.వెంకటనారాయణ, రమేశ్, వీవో ఉమారాణి, అన్నపూర్ణ, డ్వాక్రా గ్రూప్ మహిళలు పాల్గొన్నారు.